క్లుప్తంగా

కమ్యూనిటీ హాల్ ప్రారంభం


కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న విష్ణురాజు

భీమవరం అర్బన్ : మండలంలోని కొవ్వాడ అన్నవరం గ్రామంలో తూర్పుకాపుల పేటలో తాచ్చెరువు గట్టుపై రూ.10 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను బీవీ రాజు ఫౌండేషన్, శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ శ్రీ విష్ణురాజు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న విష్ణురాజుకు గ్రామ పెద్దలు వీవీఎస్ సూర్యనారాయణ రాజు, వి.బలరామరాజు, సూర్యనారాయణ రాజు, పి.నీలకంతం మాస్టార్ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ల్యాబ్ ప్రారంభం

సాక్షి, భీమవరం : స్థానిక ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతికశాస్త్ర ప్రయోగ శాలను సోమవారం వసుధ ఫౌండేషన్ కార్యదర్శి మంతెన కృష్ణంరాజు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వీకేజే ప్రసూన మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతికశాస్త్ర ప్రయోగ శాల ఏర్పాటుకు దాతలు అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని అన్నారు. పూర్వవిద్యార్థుల సహకారంతో ప్రయోగశాలకు ముఖ్యమైన పరికరాలు ఏర్పాటుచేశామని, మరింత మంది దాతల సహకారం అవసరమన్నారు. ఇందుకూరి ప్రసాదరాజు, ఎం.వంశీకృష్ణంరాజు, కిరణ్‌కుమార్, ఎస్.సుధాకరరావు, ఎస్ లక్ష్మీకాంతం, పి.రాజశేఖర్ పాల్గొన్నారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు

భీమవరం(ప్రకాశం చౌక్) : పట్టణంలోని జువ్వలపాలెం రోడ్డులో వేంచేసియున్న శ్రీపద్మావతి వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి, అమ్మవార్లకు చందనాలంకరణ నిర్వహించారు. ఆలయ ఈఓ రుద్రరాజు గంగా శ్రీదేవి, ఆలయ ఛైర్మన్, ధార్మిక పరిషత్ సభ్యుడు మంతెన రామ్‌కుమార్ రాజు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం

వైశాఖ శుద్ధ ఏకాదశి పురస్కరించుకుని కొత్త బస్టాండ్ వద్ద ఉన్న అలివేలు మంగా పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సోమవారం గ్రంధి సాగర్, సుధా దంపతులచే కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. పురోహితులు లాలు, అర్చకులు ర్యాలీ వేణుగోపాల కృష్ణమూర్తి, శ్రీనివాస్ శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, గ్రంధి బాలాజీ, గ్రంధి రవితేజ, కాకులపాటి చలపతిరావు దంపతులు కుటుంబ సమేతంగా ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భారీ సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ తోట భోగయ్య దంపతులు, సమతం తాతాజీ, లీలా పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాల కల్పనకు ఒప్పందం

సాక్షి, భీమవరం : విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, ఉద్యోగ అవకాశాలు మెరుగుపర్చేందుకు ప్రముఖ స్టార్టప్ కంపెనీ క్యారీ షేర్ సొల్యూషన్స్‌తో ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎంఓయూ కుదుర్చుకుందని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.జగపతిరాజు చెప్పారు. ఈమేరకు సోమవారం కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్‌వర్మ, క్యారీషేర్ సొల్యూషన్ సీఈవో ఎంఎస్ పవన్‌కుమార్‌రాజు ఎంఓయూ పత్రాలను మార్చుకున్నారని ప్రిన్సిపాల్ విలేకర్లకు వివరించారు. కార్యక్రమంలో టెక్నాలజీ సెంటర్ హెడ్ నూకల గోపాల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ


13వ వార్డులో పింఛన్ అందజేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : పట్టణంలోని 13వ వార్డులో సోమవారం సచివాలయ కన్వీనర్ గంటా అనితారాణి ఫించన్ల పంపిణీ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజకీయ, కుల, మతాలకు అతీతంగా ఇంటివద్దకే సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు. సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ ఎన్ ప్రభాకర్, వలంటీర్లు వై మాధవి, అనిత, వైఎస్సార్‌సీపీ నాయకుడు గంటా సుందరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్షంలోనూ..


కాళ్లలో పింఛన్ అందజేస్తున్న దృశ్యం

కాళ్ల : వర్షంలోనూ వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేశారు. సోమవారం తెల్లవారు జామునుంచి భారీ వర్షం పడుతున్నా గొడుగులు పట్టుకుని వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు ఇంటికి వెళ్లి పింఛన్లను అందజేశారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పింఛన్లు అందజేయడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

కేంద్రం విధానాలను మేడే స్ఫూర్తితో తిప్పికొట్టాలి



భీమవరంలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రదర్శన


వెంపలో సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను మేడే స్ఫూర్తితో తిప్పుకొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్ పిలుపునిచ్చారు. సోమవారం భీమవరంలో మే డే సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తొమ్మిదేళ్లలో ప్రధాని నరేంద్రమోదీ కార్పొరేట్ శక్తులకు రూ.లక్షల కోట్లు రాయితీలిస్తూ కార్మికులపై తీవ్రమైన భారాలు వేశారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ధరలు అరికట్టడంలో విఫలమైందని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచి సామాన్యులపై తీవ్ర భారం మోపిందని ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ పాలన పోవాలంటే కార్మిక వర్గం మేడే స్ఫూర్తితో ఐక్య పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అనంతరం పెద్ద సంఖ్యలో కార్మికులతో ప్రదర్శన నిర్వహించారు. సీఐటీయూ నాయకులు బి. వాసుదేవరావు, ఎం.వైకుంఠరావు, కలిపిండి సత్యనారాయణ, కె.వెంకటేశ్వరరావు, ఎస్ శ్రీనివాసరావు, బంగారు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..

మేడే సందర్భంగా పట్టణంలోని సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పలుప్రాంతాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఏఐటీయూసీ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ ప్రపంచ కార్మికులారా ఏకంకండి దేశాన్ని రంక్షించండి అంటూ పిలుపునిచ్చారు. కార్మిక చట్టాలను కాపాడాలని, కార్మిక, కర్షక, ఉద్యోగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రదర్శన నిర్వహించారు. కిల్లరి మల్లేశ్వరరావు, నీలపు శ్రీను, రమణారావు, బంగారు శివ, యాకోబు, ఆకలి రాము, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ఆధ్వర్యంలో..

ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అనుబంధ సంస్థ ఆలిండియా ట్రేడ్ యూనియన్ నాయకత్వంలో మేడే వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. భీమవరం పట్టణం, రూరల్ మండలంలోని వివిధ గ్రామాల్లో పార్టీ జెండాలు ఆవిష్కరించారు. పార్టీ నాయకులు లంక కృష్ణమూర్తి, దండు శ్రీనివాసరాజు, వీకే రాజు, శ్రీనివాసు రాంబాబు పాల్గొన్నారు. నాచువారి సెంటర్లో బజారు లాగుడు బళ్ల ముఠా కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. గనిరెడ్డి సన్యాసిరావు, ఎస్.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి

పట్టణంలోని తాపీపనివారల సంఘం భవనంలో సోమవారం మేడే వేడుకలను సహాయకార్మిక కమిషనర్ ఎ.లక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భీమవరం రెండవ సర్కిల్ సహాయ కార్మికాధికారి కాశి శివనాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ కార్మికుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలన్నారు. లేబర్ ఆఫీసర్లు కె.గోపికుమార్, ఎం కిరణ్‌కుమార్, బి.లక్ష్మణ్‌కుమార్, కేబీఆర్ శర్మ, కాగిత వెంకటరమణ, పులఖండం కోటేశ్వరరావు, చెన్నంశెట్టి నాగేశ్వరరావు, మెల్లా సత్యనారాయణ పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను హరించడం దారుణం

భీమవరం అర్బన్ : ప్రధాని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా 44 కార్మిక చట్టాల్ని 4 లేబర్ కోడ్‌లుగా విడగొట్టి కార్మిక హక్కుల్ని హరించడం దారుణమని సీఐటీయూ మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ విమర్శించారు. వెంప గ్రామంలో ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఇంజేటి శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమాలను ఉధృతం చేయాలన్నారు. పంచాయతీ కార్మికులు సానబోయిన కృష్ణారావు, మందా పోలురాజు, కాటిక రాజు, అన్నిచెట్టి ప్రసాద్, గుబ్బల సోమేశ్వరరావు, సానబోయిన సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దుచేయాలి

కాళ్ల : కాళ్ల గ్రామంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ పతాకాన్ని శ్రామిక మహిళా జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మిక లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, రైతు వ్యతిరేక చట్టాలను, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు గొర్ల రామకృష్ణ, మండా సూరిబాబు మాట్లాడుతూ కార్మిక కర్షక ఉద్యోగుల వ్యతిరేక విధానాలను ఐక్య ఉద్యమాల ద్వారా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ నాయకులు దావులూరి మార్తమ్మ, ఝాన్సీ, ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు రెడ్డి దేవి, పైడితల్లి భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పసుపులేటి సత్యనారాయణ, పుట్టపోతులు మధు, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం దాసరి వెంకటేశ్వరరావు, ఏడుకొండలు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గరికముక్కల ఆజమ్మ, శాంతమ్మ మత్స్య కార్మిక సంఘం తిరుమని శ్రీను, మహిళా సంఘం తిరుమని రామలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు

కార్మిక చట్టాలను పరిరక్షించుకోవాలి

ఆకివీడు : కార్మిక, కర్షక వ్యతిరేకి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మనస్సు నిండా కార్పొరేట్ భావజాలాలు నిండిపోయాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జేఎన్వీ. గోపాలన్ మండిపడ్డారు. మేడే సందర్భంగా సోమవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో జెండా ఆవిష్కరించారు. వెలంపేట నుంచి ప్రధాన రహదారి మీదుగా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సీపీఎం పార్టీ వద్ద నిర్వహించిన సభలో గోపాలన్ మాట్లాడుతూ పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాల్ని కేంద్రం తుంగలో తొక్కుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు పెంకి అప్పారావు అధ్యక్షత వహించగా, సీనియర్ సీపీఎం నాయకులు బి.సత్యనారాయణ, కె.తవిటినాయుడు, లక్ష్మీనారాయణ మూర్తి, బొర్రా శ్రీను, బి.మహంకాళి, బి.రాంబాబు, బీవీ వర్మ, జి.ధనుష్, జీవీ లావణ్య, శంకర్, బి.కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉద్యమించాలి

ఉండి : ఉండిలో మేడే వేడుకలను సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉండి సెంటర్‌లోని సీపీఐ, సీపీఎం పార్టీల కార్యదర్శులు కలిశెట్టి వెంకట్రావు, ధనికొండ శ్రీనివాస్ పార్టీ కార్యాలయాల వద్ద పతాకావిష్కరణ చేశారు. మేడే స్ఫూర్తితో ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో సీఐటీయూ జిల్లా కార్యదర్శి క్రాంతిబాబు, కొట్టాడ వెంకటేశ్వరరావు, పూసపాటి వెంకట్రామరాజు, సనపల శ్రీనివాస్, కోన గొలయ్య తదితరులు పాల్గొన్నారు.



కాళ్లలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు


ఆకివీడులో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జేఎన్వీ గోపాలన్


ఉండిలో మేడే వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

అకాల వర్షంతో అతలాకుతలం


సిద్ధాపురంలో వర్షం నీటిలో ధాన్యం తడిసిపోతున్న దృశ్యం


కాళ్లలో నీట మునిగిన రాష్ట్రీయ రహదారి

ఆకివీడు : అకాల వర్షానికి సోమవారం ఉదయం పట్టణంలోని పలు రోడ్లు నీట మునిగాయి. జాతీయ రహదారితోపాటు వీధుల్లోని రోడ్లు నీట మునగడంతో ప్రజలకు అసౌకర్యం ఏర్పడింది. పల్లపు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానిక సంతపేట, సాలిపేట, పెదపేట, ఎస్.టర్నింగ్ రోడ్డు, గంగానమ్మకోడు, మూలలంక కాల్వగట్లకిరువైపులా ఉన్న ఇళ్లల్లోకి మురుగు నీరు చొచ్చుకువెళ్లింది. పట్టణంలోని పలు వార్డుల్లో డ్రెయినేజీల్లో పూడిక తీయకపోవడంతో వర్షపు నీరు ముంచెత్తింది. మాదివాడ, మందపాడు, సిద్ధాపురం, చెరుకుమిల్లి, తదితర గ్రామాల్లో వర్షపు నీరు రాశుల్లోకి చొచ్చుకువెళ్లి ధాన్యం స్వల్పంగా తడిసింది.

కాళ్ల : వాతావరణ మార్పుల కారణంగా సోమవారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురవడంతో కళ్లాల్లో ఉన్న పంటను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడ్డారు. ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునేందుకు రైతులు పరుగులు పెట్టారు. ఇప్పటికే మండలంలో వేంపాడు ,కోపల్లె, జక్కరం, బొండాడ, సీసలి, కాళ్ల, కాళ్ళకూరు తదితర గ్రామాల్లో ముమ్మరంగా మాసూళ్లు చేపట్టారు. వాతావరణం అనుకూలించి కొన్ని రోజులు వర్షాలు పడకుండా ఉంటే దాళ్వా పంటను కాపాడుకోవచ్చని రైతులు ఆశిస్తున్న ఈ తరుణంలో వర్షం పడటంతో రైతుల గుండెల్లో గుబులు మొదలైంది. పంటను కాపాడుకునేందుకు రైతులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

స్తంభించిన జనజీవనం

భీమవరం అర్బన్ : భీమవరం మండలంలో దిరుసుమర్రు, యనమదుర్రు, గొల్లవానితిప్ప, అనాకోడేరు, తుందుర్రు, కొత్తపూసలమర్రు, దెయ్యాలతిప్ప, చినఅమిరం, రాయలం, వెంప తదితర గ్రామాల్లో సోమవారం నాలుగు గంటల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. ఈ వర్షంతో పల్లపు గ్రామాలైన నాగిడిపాలెం, దొంగపిండి, కొత్తపూసలమర్రు, తోకతిప్ప తదితర గ్రామాలలో శివారు ప్రాంతాలలో రోడ్లు జలమయమయ్యాయి. దాళ్వా సాగు మాసూళ్లు ముమ్మరంగా జరుగుతున్న నేపథ్యంలో కళ్లాల్లో ఉన్న ధాన్యపు రాశులలోకి వర్షపు నీరు వెళ్లి తడిసిపోయాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోతలు వాయిదా వేసుకోవాలి

మరో రెండు రోజులు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరికలు నేపథ్యంలో రైతులు రెండు రోజులు దాళ్వా కోతలు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ సూచించారు. సోమవారం మండలంలోని తాడేరు, బేతపూడి, తుందుర్రు గ్రామాలలో మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ పర్యటించి ధాన్యపు రాశులు, చేలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎమ్‌టీయూ 1121 వరి వంగడం సాగు చేయడం జరిగిందని, ఇది వర్షానికి పడిపోయే గుణం లేనిదని రెండు రోజులు మాసూళ్లు వాయిదా వేసుకోవాలన్నారు. కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని వీలైనంత తొందరగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు, సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ఏవో శ్రీనివాస్ వెంట విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రైతులు ఉన్నారు.

పాలకోడేరు : మండలంలో సోమవారం మోస్తరు వర్షం కురిసింది. కొన్నిచోట్ల పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరి పంటకు ఎలాంటి నష్టం లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయ శాఖాధికారి తెలిపారు. మోగల్లులో రోడ్లు జలమయ్యాయి.


బేతపూడిలో కళ్లాల్లో ఉన్న ధాన్యపు రాశులను పరిశీలించి సూచనలు ఇస్తున్న ఏవో శ్రీనివాస్


మోగల్లులో జలమయమైన రోడ్డు

తడిసిన ధాన్యంపై ఉప్పు ద్రావణం చల్లాలి


చెరుకుమిల్లిలో రైతుతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు


ఉండిలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

ఆకివీడు : అకాల వర్షానికి రాశుల్లో ఉన్న ధాన్యం తడిసినా, పనలపై ఉన్నా ఉప్పు ద్రావణం 5 శాతం నీటిలో కలిపి పిచికారీ చేయాలని ఏడీఏ కే.ఎస్.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని చెరుకుమిల్లి, మందపాడు, అయిభీమవరం, మాదివాడ, గ్రామాల్లో వర్షానికి పంట నష్టం అంచనావేయడానికి పర్యటించారు. ఆయన రైతులతో మాట్లాడుతూ ధాన్యం రాశుల్ని టార్పాలిన్‌లతో కప్పినప్పటికీ కింద నుండి నీరు లాగుతుందన్నారు. దీనివల్ల రాశుల అంచుల్లో ధాన్యం తడిసే అవకాశం ఉందన్నారు. పనలపై ఉన్న వరిపై ఉప్పునీటిని చల్లడం ద్వారా ధాన్యం రంగు మారకుండా, మొలక రాకుండా ఉంటుందని చెప్పారు. ఏఓ ప్రియాంక మాట్లాడుతూ మరో మూడు రోజులు వర్ష సూచన ఉన్నందున వరి కోతలు వాయిదా వేసుకోవాలన్నారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సైదాల సూర్యనారాయణ, సర్పంచ్ నందమూరి ప్రకాశం, రైతులు పాల్గొన్నారు.

ఉండి : తడిసిన ధాన్యంపై ఉప్పుద్రావణం చల్లితే మొలకెత్తే ప్రమాదం నుంచి ధాన్యాన్ని కాపాడుకోవచ్చునని మండల వ్యవసాయాధికారి బి.సంధ్య అన్నారు. ఉండి మండలంలో సోమవారం కురిసిన అకాల వర్షాల కారణంగా కొంతమేర ధాన్యం తడిసిపోయింది. దీంతో మండల వ్యవసాయాధికారి సంధ్య, రైతు భరోసా కేంద్ర అధికారులు మండల వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. ఉండిలో వ్యవసాయాధికారి సంధ్య మాట్లాడుతూ అకాల వర్షాలకు రైతులు ఆరబోసిన ధాన్యం తడిసిపోయిందన్నారు. తడిసిన ధాన్యాన్ని అలాగే వదిలేయకుండా ఉప్పుద్రావణాన్ని ధాన్యంపై పిచికారి చేయాలన్నారు. వరిచేలల్లో నిలిచిన వర్షపు నీటిని సాధ్యమైనంత త్వరగా బయటకు పంపించాలన్నారు. కొన్ని రోజులపాటు కోతలు వాయిదా వేస్తే మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్బీకే అధికారి జే ఆల్‌ఫ్రెడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కలిగొట్లలో గడపగడపకు

ఉండి : కలిగొట్ల గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు తెలిపారు. డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ముఖ్య అతిథిగా పాల్గొనే ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

ధాన్యం తరలింపులో వివాదం

ఉండి : ఉండి మండలం చినపుల్లేరులో తడిసిన ధాన్యాన్ని తరలించేందుకు రైతు సువర్ణరాజు చేసిన ప్రయత్నాలను స్థానికంగా ఉన్న మరో రైతు అడ్డుతగలడంతో అతను గ్రామ రెవెన్యూ అధికారి దాసుకు ఫిర్యాదు చేశాడు. దీంతో వీఆర్వో, ఆర్బీకే అధికారులు ఘటనాస్థలానికి వెళ్లి ధాన్యం తరలింపులో ఎటువంటి ఆటంకాలు పెట్టవద్దని సూచించారు. అయినా పట్టించుకోకపోవడంతో ఇరుపక్షాల రైతులు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించినట్లు సమాచారం. అయితే ఈ వివాదంపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై గంగాధరరావు తెలిపారు.

స్పందనలో అల్పాహారం

భీమవరం(ప్రకాశం చౌక్) : ప్రతి సోమవారం స్పందన కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఇకనుంచి అల్పాహారం అందించనున్నారు. జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో చిరు ధాన్యాలతో తయారు చేసి అల్పాహారాన్ని అందించే కార్యక్రమాన్ని సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ సుందర్‌రెడ్డి ప్రారంభించారు. ప్రతి సోమవారం స్పందన ఫిర్యాదుదారులకు, వారి సహాయకులకు సుమారు 250 మందికి అల్పాహారం అందజేయడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్‌కు జేసీ సూచించారు. రెడ్ క్రాస్ ఛైర్మన్ ఎస్.శివరామభద్రిరాజు మాట్లాడుతూ కలెక్టర్ సూచనల మేరకు స్పందన ఫిర్యాదుదారులకు, సహాయకులకు సోమవారం రాగి ఇండ్లి, సామెల పొంగలి, మజ్జిగను అల్పాహారంలో అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కోశాధికారి కె.తిరుపతిరాజు, ఏవో వై.దుర్గాకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో ఏడు ఫిర్యాదులు

ఆకివీడు: స్పందన కార్యక్రమంలో ఏడు ఫిర్యాదులు అందినట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీఓ ఎస్.శ్రీకర్ సోమవారం చెప్పారు. దుంపగడప బోసు కాలనీలో డబ్బా ట్రాన్స్‌ఫార్మర్ స్థానే 60 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ వేయాలని, మైనర్లు టూవీలర్లు నడుపుతున్నారని, సైలెన్సర్లు తీసి నడపడం వల్ల తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుందని ఫిర్యాదు వచ్చిందన్నారు. నగర పంచాయతీ ఆశీలు వసూళ్ల రశీదులపై పంచాయతీ ముద్ర లేదని, అదనపు పన్నులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదు వచ్చిందన్నారు. కుప్పనపూడిలోని సర్వే నెంబర్ 129/1 లోని పంట పొలంలో పంట కోసుకుపోయారని, వారిపై చర్య తీసుకోవాలని, కుప్పనపూడిలోని నివేశన స్థలం ఆక్రమణలకు గురైందని, సర్వే చేయించాలని మరో ఫిర్యాదు వచ్చిందని శ్రీకర్ తెలిపారు. అదే గ్రామంలోని సబ్సిడీ తొలగించి కరెంట్‌బిల్లు ఇస్తున్నారని, దానిపై విచారణ చేయాలని ఫిర్యాదు అందిందన్నారు. ఆయా ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులకు పంపించామన్నారు.

ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం

సాక్షి, భీమవరం : క్రీడల ద్వారా యువత ఆత్మస్థైర్యాన్ని, సంపూర్ణ ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చునని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.జగపతిరాజు అన్నారు. కళాశాలలో మూడు రోజులపాటు నిర్వహించే ఫుట్‌బాల్ లీగ్ పోటీలను సోమవారం టాస్ వేసి ప్రారంభించారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్, ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీల్లో ఆరు టీములు పాల్గొంటాయన్నారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేమిరెడ్డి హరికృష్ణ, వానపల్లి రమేష్, క్రీడల కన్వీనర్ పి.సత్యనారాయణ రాజు, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ సీహెచ్ హరిమోహన్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

భీమవరం అర్బన్ : భీమవరం కోర్టులలో ఈనెల 13న నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ప్యానల్ లాయర్ నర్కిమిల్లి సుధీర్ కోరారు. గొల్లవానితిప్ప గ్రామంలో సర్పంచ్ చిల్లే వెంకటేష్ అధ్యక్షతన మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్యానల్ లాయర్ నర్కిమిల్లి సుధీర్ మాట్లాడుతూ కోర్టులలో పెండింగ్‌లో ఉన్న సివిల్ తగాదాలు, పోలీస్ కేసులు, మనోవర్తి కేసులు, మోటార్ వెహికల్ ప్రమాద బీమాకు సంబంధించిన కేసులు, చెక్ బౌన్స్ కేసులు రాజీ చేసుకునేందుకు జాతీయ లోక్‌అదాలత్ ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు డి.రవికిరణ్, బి.సునీల్ కుమార్, నరేష్, రూరల్ ఎస్సై మోహన్‌రావు, ఉప సర్పంచ్ బుద్ధా రామకృష్ణ, కార్యదర్శి భవానీ, పీఎల్‌వీ కమల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

లలిత కళల శిక్షణ ప్రారంభం

భీమవరం(ప్రకాశం చౌక్) : స్థానిక ఏఎస్ఆర్ నగర్‌లోని అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో 30 రోజులపాటు నిర్వహించనున్న ఉచిత లలిత కళల శిక్షణా శిబిరాన్ని సోమవారం అల్లూరి సీతారామరాజు సేవా సమితి అధ్యక్షుడు గాదిరాజు సుబ్బరాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా 1వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. యోగా, కరాటే, నృత్యం, సంగీతం, లలిత కళలు తదితర వాటిలో శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమితి కార్యదర్శి సీహెచ్ ఏవీడీ సుబ్రహ్మణ్యం రాజు, ఉపాధ్యక్షులు రుద్రరాజు వేణుగోపాలరాజు, చేకూరి ఝాన్సీ లక్ష్మి, కోశాధికారి నడింపల్లి వెంకట సత్య సుబ్బరాజు, సభ్యులు ముదుండి సత్యనారాయణరాజు, చేకూరి భీమరాజు, శిక్షణ శిబిరం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.